Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 330 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily) శనివారం, 10 - 5 - 2025


94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ఉద్రిక్త పరిస్థితుల వేళ.. జమ్మూలో పర్యటించిన సీఎం



**న్యూఢిల్లీ :** భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు జమ్మూ ప్రభుత్వం తరలిస్తుంది. ప్రజలకు భోజనంతోపాటు షెల్టర్లను అధికారులు ఏర్పాటు చేశారు. అలాగే ఫుడ్, మెడికల్ క్యాంపులను అధికారులు ఏర్పాటు చేశారు. మరోవైపు నగరంలో పరిస్థితుల స్థితిగతులు తెలుసుకునేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా జమ్మూలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆయన చర్చించారు. అలాగే వారికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ఇక జమ్మూ కాశ్మీర్‌లోని విద్యా సంస్థలకు సోమవారం వరకు సెలవు ప్రకటించారు. స్థానిక పరిస్థితులపై సోమవారం చర్చించి.. సెలవులు పొడిగించాలా లేదా అనే అంశంపై చర్చించి ఓ నిర్ణయానికి వస్తామని చెప్పారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకున్న నేపథ్యంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు పాఠశాలకు సెలవులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పలు నగరాల్లో సైరన్ వినిపించిన సంగతి తెలిసిందే. అక్నూర్, సాంబ, బారాముల్లా, కుప్వారా తదితర నగరాల్లో ఈ సైరన్ శబ్దం వినిపించింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా అన్ని పోర్టుల్లో భద్రతను పెంచారు. వాటి వద్ద భద్రతను రెండో లెవల్‌కు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భద్రతా పెంపు ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయన్న షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ కీలక ప్రకటన చేశారు. పోర్టులు, షిప్పులు, టర్మినల్స్‌లో భద్రతను కేంద్రం పెంచింది. ఇంకోవైపు.. శుభకార్యాలయాల్లో టాపాసులు పేల్చకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే దేశంలోని అన్ని రాష్ట్రాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అప్రమత్తం చేసింది. అవసరమైతే ముందు జాగ్రత్త చర్యలను సమర్థవంతంగా అమలు చేయడానికి పౌర రక్షణ నిబంధనల ప్రకారం.. అత్యవసర అధికారాలను ఉపయోగించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ.. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది.

## భారత్ టెర్రరిజానికి వ్యతిరేకం : సీఎం చంద్రబాబు నాయుడు



**అనంతపురం, (రాజధాని వార్తలు):** భారతదేశం టెర్రరిజానికి వ్యతిరేకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు (శుక్రవారం) ఛాయాపురం ప్రజావేదికలో సీఎం మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో అతికిరాతకంగా ఆడబిడ్డల ఎదురుగా మగవాళ్లను ఇష్టానుసారం చంపేశారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సిందూర్ అనే కార్యక్రమం పెట్టిందని.. టెర్రరిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని అన్నారు. భారత్ మీద దాడులు చేస్తూ పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. దేశభక్తితో వీర జవాన్ మురళీ నాయక్ అనంతపురం జిల్లా వాసి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి అని విధాలా అండగా ఉంటామని..ఆ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. దేశం కోసం మురళీనాయక్ వీర మరణం పొందారని.. అతడి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నానన్నారు. బార్డర్‌లో ఉండి నిద్రాహారాలు మాని జవాన్లు దేశ రక్షణ చేస్తుండటం వల్లే ఇక్కడ మనం హాయిగా నిద్ర పోతున్నామన్నారు. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడటం మంచిది కాదన్నారు. దేశం చేసే పోరాటానికి ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలన్నారు. భారత్ మాతాకు జై అంటూ చంద్రబాబు నినాదాలు చేశారు. అలాగే వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని సీఎం చంద్రబాబు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కాగా.. భారత్ – పాక్ యుద్ధ భూమిలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందారు. మురళీ నాయక్ మృతి పట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా రాజకీయ నేతలు నివాళులర్పించారు. మృతుడు మురళీ నాయక్ కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు సీఎం. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రేపు (శనివారం) మురళీ నాయక్ మృతదేహం స్వస్థలానికి చేరుకోనున్నారు.

**సీఎం పర్యటన..**

అనంతపురం జిల్లాలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. ఉరవకొండ నియోజకవర్గం చాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా పనులపై అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కి.మీ మేర సాగుతున్న పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు. ప్రోగ్రామింగ్ ద్వారా రోజూ ఎంతమేర పనులు చేశారో డ్రోన్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. నాలుగు ఏజన్సీల ద్వారా పనులు జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. ఇటీవల నాలుగుసార్లు వర్షాలు కురవడంతో పనులకు కొంతమేర ఆటంకం ఏర్పడిందని తెలుపగా... ఇకపై వేగంగా పనులు సాగించాలని సీఎం సూచించారు. నిర్దేశిత కాలానికి ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## పోతుల పేరంటాలుపై అభిమానంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్





**పిఠాపురం, (రాజధాని వార్తలు):** పిఠాపురం నియోజకవర్గం, యు. కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన 96 ఏళ్ల పోతుల పేరంటాలు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ మీద అభిమానంతో ఆయన విజయం సాధించాలని వేగులమ్మ తల్లికి పొర్లు దండాలు పెట్టి అమ్మవారికి గరగ చేయిస్తానని మొక్కుకున్నారు. తన పింఛను సొమ్ము నుంచి రూ.2,500 చొప్పున పోగు చేసి, రూ.27 వేలతో గరగ చేయించి సమర్పించారు. ఆమెకు తనతో కలిసి భోజనం చేయాలని ఉందని తెలిసిన వెంటనే, ఈ రోజు పేరంటాలుని క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించి, ఆవిడతో కలిసి భోజనం చేసి, చీరను, లక్ష రూపాయల నగదును అందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.

## భారత్ - పాక్ వార్.. తెలుగు రాష్ట్రాల్లోని ఆ ప్రాంతాల్లో హైఅలర్ట్

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ తెలుగు రాష్ట్రాల్లోని 14 ప్రాంతాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, కూకట్‌పల్లి, నాంపల్లి, హైదరాబాద్ సెంట్రల్ బస్‌స్టేషన్, తిరుమల, విశాఖ ఆర్కే బీచ్, విజయవాడ రైల్వేస్టేషన్, విజయవాడ బస్‌స్టాండ్, ఎంజీ రోడ్‌లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం సూచించింది. పాక్ దాడుల నేపథ్యంలో టీటీడీ అధికారులను కేంద్ర హోంశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. తిరుమల్లో తీసుకువాల్సిన భద్రతా చర్యలపై టీటీడీ అధికారులకు కేంద్ర హోం శాఖ అధికారులు పలు సూచనలను చేశారు. కేంద్రం ఆదేశాలు మేరకు తిరుమల్లో భద్రతను టీటీడీ మరింత పటిష్టం చేసింది. మరోవైపు భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రాలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అప్రమత్తం చేస్తోంది. అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లేఖ రాసింది. అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను సమర్థవంతంగా అమలు చేయడానికి పౌర రక్షణ నిబంధనల ప్రకారం అత్యవసర అధికారాలను ఉపయోగించాలని ఆదేశించింది. అలాగే దేశ వ్యాప్తంగా అన్ని పోర్టుల్లో భద్రత పెంచారు. భద్రతను రెండో లెవల్‌కు పెంచుతూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భద్రతా పెంపు ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ తెలిపారు. పోర్టులు, షిప్పులు, టర్మినల్స్‌లో కేంద్రం భద్రతను పెంచింది.




**స్టేషన్లలో భద్రత పెంచాం: సెంట్రల్ రైల్వే సిపిఆర్వో శ్రీధర్**

భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో భద్రత పెంచామని సెంట్రల్ రైల్వే సీపీఆర్వో శ్రీధర్ అన్నారు. ఏబీఎన్–ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఉద్యోగుల సెలవులను రద్దు చేశామన్నారు. ఆర్పీఎఫ్, ఇంటెలిజెన్సీ పోలీసుల నిఘా పెంచామని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను రద్దు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే నుంచి గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్ రూట్లల్లో రైళ్ళు యథావిధిగా నడుస్తున్నాయని అన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్‌పై ప్రత్యేకంగా నిఘా పెట్టామని శ్రీధర్ వెల్లడించారు.

## మద్యం కేసు దర్యాప్తులో సిట్ దూకుడు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ మద్యం స్కాం కేసు దర్యాప్తులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. మద్యం కేసులో నిందితుల ఇళ్లపై సిట్ అధికారులు ఇవాళ (శుక్రవారం) హైదరాబాద్‌లో ఒకేసారి సోదాలు చేశారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో హైదరాబాద్‌లో నాలుగు చోట్ల సోదాలు జరిపారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, మాజీ పీఏ కృష్ణమోహన్ రెడ్డి, ఆయన కుమారుడు రోహిత్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప ఇళ్లు, కార్యాలయాలపై సిట్ అధికారులు సోదాలు చేశారు. బంజారాహిల్స్‌లోని రోడ్ నెంబర్ 12లో కల్వ ధనుంజయ రెడ్డి ఇంట్లో ఏపీ పోలీసులు సోదాలు చేశారు. ఏపీ లిక్కర్ పాలసీలో ధనుంజయ రెడ్డి పాత్ర కీలకంగా ఉందని గుర్తించారు. బాలాజీ గోవిందప్ప అందుబాటులో లేకపోవడంతో ఆయన సతీమణికి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. అలాగే కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇంట్లో లేకపోవడంతో ఆయన కుమారుడు రోహిత్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసి వారి ఇళ్లల్లో సిట్ ప్రత్యేక అధికారులు సోదాలు ప్రారంభించారు. ఒకేసారి హైదరాబాద్‌లో ముగ్గురు కీలక నిందితుల ఇళ్లపై సిట్ అధికారులు సోదాలు జరిపారు. మే 11వ తేదీ తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ సిట్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. లిక్కర్ స్కాంలో కృష్ణమోహన్ రెడ్డి కీలకంగా ఉన్నారు. విచారణకు హాజరుకాకుండా కృష్ణమోహన్ రెడ్డి తప్పించుకు తిరుగుతున్నారని అధికారులు తెలిపారు. ముందస్తు బెయిల్ కోసం కృష్ణమోహన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా కృష్ణమోహన్ రెడ్డి సుప్రీం కోర్టులో వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్ అయింది. కాగా.. ఏపీ లిక్కర్ స్కామ్‌లో కుట్ర దాగి ఉందని ఇప్పటికే విచారణలో సీఐడీ అధికారులు తేల్చారు. ముడుపుల రూపంలో రూ. 3200 కోట్లు చేతులు మారినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్పలు కీలకంగా ఉన్నట్లు సీఐడీ అధికారులు ఇప్పటికే విచారణలో తేల్చారు. భారతి సిమెంట్ డైరెక్టర్ ఉన్న గోవిందప్ప లిక్కర్ విధానంలో ముడుపులు తీసుకున్నట్లు గుర్తించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే వీరు అనుకున్నట్లుగా లిక్కర్ పాలసీని తీసుకువచ్చారని గుర్తించారు. ధనుంజయ్ రెడ్డి ఇంట్లో ఏపీ సీఐడీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఇప్పటికే కీలక పత్రాలను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లిక్కర్ సరఫరా చేసే వారి దగ్గర నుంచి ముడుపులు తీసుకున్నట్లు గుర్తించారు. ముడుపుల ద్వారా వచ్చిన సొమ్మును డొల్ల కంపెనీలకు బదిలీ చేసినట్లు అధికారులు తేల్చారు. పర్సంటేజ్‌లపై చర్చించేందుకు హైదరాబాద్, తాడేపల్లిలో మద్యం యజమానులతో చర్చించినట్లు సీఐడీ అధికారులు విచారణలో తేల్చారు.

## భారత్-పాక్ యుద్ధం.. తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడి నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు ఒక నెల వేతనం విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. విరాళం ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చించారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. మన భారత గడ్డ మీద పర్యాటకులను చంపిన తీవ్రవాదులను ఏరివేత లక్ష్యంగా దేశ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ టార్గెట్ విజయవంతం అయ్యేందుకు దేవాదాయ శాఖకు మంత్రి కొండా సురేఖ కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని మన రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయంలో పూజలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంతటి సంక్లిష్టమైన సమయంలో భారత ఆర్మీకి అంతా అండగా నిలవాల్సిన సందర్భమన్నారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ రెండో దాడి విజయవంతం అవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. మన ఆర్మీ బలగాలు సరిహద్దులో పెద్ద ఎత్తున పోరాడుతున్న సమయంలో వారి క్షేమం కోరి అంతా పూజలు చేయడం సందర్భోచితమని మంత్రి కొండా సురేఖ అన్నారు. తీవ్రవాదాన్ని యావత్ భారతమంతా ఉక్కు పిడికిలితో ఎదుర్కొన్నదన్నారు. ఈ సమైక్యత దేశ భద్రత విషయంలో రానున్న రోజుల్లో కూడా ఉంటుందన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా..ఎక్కడ ఉన్నా కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మన దేశ పౌరుల మీద ఇటీవల కాశ్మీర్‌లో జరిగిన దాడికి నిరసనగా ఇండియన్ మిలటరీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అందరూ స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ మంత్రిగా కాదు, ఇంతటి గొప్ప దేశ పౌరురాలిగా ఈ చర్యపై చాలా సంతోషంగా భావిస్తున్నట్లు తెలిపారు. పుల్వామాలో మనం కోల్పోయిన వీర సైనికులను తిరిగి తీసుకురాలేమని.. వారి త్యాగం శాశ్వతమన్నారు. మనమున్నంత కాలం వారిని స్మరించుకుంటామన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తలెత్తి నిలిచిందన్నారు. ఏకత్వంతో, శక్తితో, నిశ్శబ్దమైన సంకల్పంతో మనల్ని ప్రపంచం నిలబెట్టిందని చెప్పుకొచ్చారు. ఇది కేవలం ప్రతిస్పందన కాదని.. ఒక ప్రతి సమాధానమని వెల్లడించారు.

# సార్వత్రిక సమ్మెను విజయవంతం చెయ్యండి




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ ప్రచురించిన సమ్మె బుక్ లెట్‌ను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం అనేక కష్టాల్లో ఉందని దాని నుండి కార్మికులను బయట పడేయాల్సిన ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని మరింత కష్టాల్లోకి నెట్టేస్తుందని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, కానీ నిజ వేతనాలు పెరగడం లేదన్నారు. మే 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె జరుగుతుందని దీనిని విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు దాడి బేబి, మాగాపు నాగు, గూనూరు రమణ, తాడిశెట్టి గంగ, డి.క్రాంతి కుమార్‌లు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణలపై విమర్శిస్తే సహించం

## - రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద మహిళల ఉపాధి కల్పనా పథకం కుట్టు శిక్షణపై విమర్శించే అర్హత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకు లేదని, దానిని సహించబోమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ హెచ్చరించారు. గురువారం సామర్లకోట పట్టణ తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడారు. అవినీతి అక్రమాలకు చిరునామాగా నిలిచిన వైఎస్ ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ నేతలు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ కుట్టు శిక్షణపై విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా శ్రీకాంత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అందుగుల జార్జి చక్రవర్తి, గోల్తి సత్యనారాయణ, పడాల వీరబాబు, మల్లిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధిపై దృష్టి సాధించాలి

## - ఎస్ ఎస్ గ్రాండ్ ఇన్ ప్రారంభంలో ఎమ్మెల్యే, కుడా చైర్మన్‌లు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సమాజంలో యువత స్వయం ఉపాధిని సాధించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబ)లు పిలుపునిచ్చారు. సామర్లకోట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన “ఎస్ఎస్ గ్రాండ్ ఇన్” అతిథి గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప, కూడా చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ సమాజంలో యువత స్వయం ఉపాధిని సాధించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఇలా స్వయం ఉపాధిని పొంది మరికొందరికి ఉపాధి అవకాశాన్ని కల్పించిన యజమాని, యువకుడు అయిన అశోక్ కృషిని ఎమ్మెల్యే, కుడా చైర్మన్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, నియోజక వర్గ



నాయకులు డా.గౌరకపూడి చిన్నయ్యదొర, తెదేపా నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీశ్ మోహన్, గోలి దొరబాబు, జనసేన నాయకులు సరోజ వాసు, పిట్టా జానకి రామారావు, పెంకే వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హెన్రీ డ్యూనాంట్ జన్మదిన వేడుక

**కాకినాడ, (రాజధాని వార్తలు):** అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు, దాతృత్వానికి పరమాన్నంగా నిలిచిన హెన్రీ డ్యూనాంట్ జన్మదిన వేడుకలు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్, గాంధీనగర్, కాకినాడలో ఘనంగా నిర్వహించారు. హెన్రీ డ్యూనాంట్ ఉమ్మడి మానవతావాదానికి చిరునామాగా నిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా సేవాభావాన్ని ప్రేరేపించే మహానుభావునికి అలయన్స్ క్లబ్ సభ్యులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ అలై. యాళ్ళ రత్నారావు హెన్రీ డ్యూనాంట్ విగ్రహానికి పూలమాలతో అలంకరించారు. క్లబ్ వ్యవస్థాపకులు అలై. దిలీప్ కుమార్ సధనాని, అలై. వై.మురళీధర్, క్లబ్ కోశాధికారి అలై. డామిశెట్టి శ్రీనివాసరావు అలై. ఆర్.రవి శంకర్ పట్నాయక్, అలై. సేతు మాధవరావు, అలై. పోల్ల సాయి బాబా, ఎన్.బాలరామ మూర్తి తదితరులు పుష్పాంజలి అర్పించారు. మహానుభావునికి అలయన్స్ క్లబ్ అఫ్ కాకినాడ శరవణ సభ్యులు ఘన నివాళి అర్పించారు. క్లబ్ ప్రెసిడెంట్ అలై. యాళ్ళ రత్నారావు మాట్లాడుతూ హెన్రీ డ్యూనాంట్ జీవితకథ ప్రతి ఒక్కరినీ మానవ సేవ పట్ల ప్రేరేపించేది. ఒక వ్యక్తి శ్రద్ధ ప్రపంచ వ్యాప్తంగా మార్పుని తీసుకురాగలదని ఆయన నిరూపించారన్నారు. అలై. దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ “రెడ్ క్రాస్ యొక్క



విలువలు, మానవత్వం, పాక్షికత లేని సేవా దృక్పథం అలయన్స్ క్లబ్ శరవణ లక్ష్యాలకు దగ్గరగా ఉన్నాయన్నారు. అతనికి నివాళి అర్పించడం మన సేవా ప్రతిజ్ఞకు గుర్తింపు అన్నారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కాకినాడ కార్యదర్శి ఎస్.శివకుమార్‌ని క్లబ్ తరపున శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్.శివకుమార్ అభినందనలందుకొని మాట్లాడుతూ ఈ గౌరవానికి అలయన్స్ అఫ్ క్లబ్ కాకినాడ శరవణకు ధన్యవాదాలు తెలిపారు. మనమందరం కలిసి పనిచేస్తూ మరెందరో జీవితాలను రక్షించగలుగుతాం. ఇది సేవా మార్గంలో మనందరికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

# రైతుల కష్టాన్ని ముంచుతున్న వర్షాలు

## - అయోమయానికి గురవుతున్న రైతులు





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రైతుల కష్టాన్ని వర్షం ముంచెత్తుతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు రైతులకు గుండెల్లో దడ పుట్టిస్తుంది. గత మూడు రోజులుగా కాకినాడ జిలాలో భారీ వర్షాలు పడుతూ రైతుల దాన్యాన్ని తడిపి ముద్ద చేస్తున్నాయి. గురువారం ఉదయం నుండి ఎండ కాయడంతో బుధవారం కురిసిన వర్షానికి తడిచిన దాన్యాన్ని రైతులు పెద్ద ఎత్తున ఆరపోసారు. ఐతే మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి రెండు గంటలు నుండి మబ్బులు ఏర్పడి వర్షం పడడంతో రైతులు వారి ధాన్యం రాశుల వైపు పరుగులు తీశారు. ధాన్యపు రాశులపై బరకాలు, గడ్డి వేసి రక్షణ చర్యలు చేపడుతున్నారు. తడిసిన ధాన్యం ఏమాత్రం ఆరకుండానే మళ్ళీ మళ్ళీ వర్షాలు పడుతుండటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సక్రమంగా ధాన్యం కొనుగోలు జరగటం లేదని, దాన్యాన్ని భద్రపరచుకొనేందుకు తమకు వసతులు లేవని రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# కరప పీహెచ్‌సీ అభివృద్ధిలో మరో ముందడుగు

## - రూ.33.49 లక్షలతో నూతన పరీక్షా భవనం నిర్మాణానికి శంకుస్థాపన





**కరప, (రాజధాని వార్తలు):** కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధిలో కీలకమైన ముందడుగు పడింది. నేషనల్ హెల్త్ మిషన్ మరియు రాష్ట్ర హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ నిధుల కింద మంజూరైన రూ. 33,49,944తో నూతన ఆరోగ్య పరీక్షల భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వర రావు (నానాజీ) వేద మంత్రాల మధ్య భూమి పూజ నిర్వహించి, నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 46 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో సాధారణ ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు పరీక్షల కోసం వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఇది వారి ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనే ఆధునిక పరీక్షా సదుపాయాలను అందుబాటులోకి తెస్తోంది అని అన్నారు. ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలు ప్రశంసనీయం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మండలంలో ఎంఎల్ఏ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కరప మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

ఈ క్రమంలో వలసపాకల గ్రామంలోని ఎస్సీ పేటలో జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన 20,000 లీటర్ల సామర్థ్య మున్న కొత్త వాటర్ హెడ్ ట్యాంక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ ట్యాంక్ ద్వారా గ్రామంలోని 180 కుటుంబాలకు శుద్ధమైన మంచినీటి సరఫరా అందించనుందని తెలిపారు. గ్రామ స్థాయిలో మంచినీటి సౌకర్యాన్ని విస్తృతంగా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన అంశం అని ఎమ్మెల్యే నానాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు.

# కరప మండలంలో వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం

## - రైతులకు 37 పవర్ టెల్లర్ ట్రాక్టర్లు అందజేత





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండలం, నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏడీఏ బాబురావు, ఏవో రాజేష్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి, వారికి ఆర్థిక సహాయం అందజేస్తోందని తెలిపారు. వ్యవసాయాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేయడానికి యాంత్రీకరణ ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. మొత్తం రూ. 37 లక్షల రాయితీతో ఏర్పాటు చేసిన 37 పవర్ టెల్లర్ ట్రాక్టర్లను రైతులకు



ఆయన చేతుల మీదుగా అందజేశారు. జనసేన నాయకులు, కూటమి నాయకులు, అధికారులు, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరంలో అధికారులపై రెచ్చిపోయిన అనంతబాబు




**అన్నవరం, (రాజధాని వార్తలు):** వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అన్నవరం సత్యదేవుని ఆలయంలో ఓవరాక్షన్ చేశారు. గురువారం స్వామివారి కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా అనంతబాబు సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం అక్షింతలు ఆలస్యమవడంతో ఆయన ఆలయ అధికారులపై ఇలా రెచ్చిపోయారు. ‘వాడెవడు.. వాడి పెత్తనం ఏమిటిక్కడ’ అంటూ ఓవరాక్షన్ చేస్తూ రెచ్చిపోయారు. ఆలయానికి వచ్చిన తనకు తగిన గౌరవం ఇవ్వలేదంటూ హడావుడి చేశారు. అక్షింతలు ఇవ్వలేదని కల్యాణ వేదిక వద్దే ఉండిపోయారు. ముఖ్య అతిథులు వెళ్లిపోయినా అనంతబాబు అక్కడే ఉండి అక్షింతలు ఇవ్వాలని పట్టుపట్టారు. ఈవో సుబ్బారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ అధికారిని ఉద్దేశించి దూషణలకు పాల్పడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు ఏపీలో పెను సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో విచారణ వేగవంతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఈ హత్యకు సంబంధించి నిందితుడు వైసీపీకి చెందిన వ్యక్తి కావడంతో పోలీసులు విచారణను పూర్తిగా నీరుగార్చిన పరిస్థితి. అదేవిధంగా ఛార్జ్‌షీట్ దాఖలులో అనేక లోపాలు కనిపించాయి. దీంతో ఈ కేసులో పురోగతి కనిపించకుండా పోయింది. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఎట్టకేలకు కేసులో కదలిక వచ్చింది. ఈ కేసుకు సంబంధించి న్యాయం చేయాలంటూ బాధితులు కోరగా.. అందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కూడా హామీ ఇచ్చారు.

# శ్రీకాంత్ 'ఆచార్య'.. ఆ కథేంటి?



ఆచార్య అనగానే చిరంజీవి, రామ్ చరణ్ కాంబినేషన్‌లో వచ్చిన డిజాస్టర్ మూవీనే గుర్తుకు వస్తుంది. కొరటాల శివ డైరెక్ట్ చేసిన ఈ యాక్షన్ డ్రామా భారీ అంచనాల నడుమ 2022లో విడుదలై ఘోరమైన విమర్శలను మూటగట్టుకుంది. బడ్జెట్ లో కనీసం సగం వసూళ్లను కూడా రాబట్టలేకపోయింది. ఈ మెగా ఆచార్య గురించి పక్కన పెడితే.. గతంలో శ్రీకాంత్ హీరోగా ఒక ఆచార్య పట్టాలెక్కిందన్న విషయం మీకు తెలుసా? 2013లో జరిగిన సంగతిది.. రక్ష సినిమా ఫేమ్ వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో శ్రీకాంత్ హీరోగా ఆచార్య పేరుతో ఓ సినిమా ప్రకటించబడింది. లేపాక్షి బ్యానర్‌పై గురురాజ్ ఈ సినిమాను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. సినిమాను అనౌన్స్ చేయడమే కాదు.. ఓపెనింగ్ కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. లాంఛింగ్ ఈవెంట్‌లో శ్రీకాంత్‌పై క్లాప్ కొట్టారు సునీల్. హైదరాబాద్‌లోనే ఆచార్య సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. లవ్ స్టోరీ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించాలని ప్లాన్ చేశారు. అందుకు తగ్గట్లే వార్నింగ్: లవ్ ఈజ్ ఇంజూరియస్ టు యూత్ అనే ఇంట్రెస్టింగ్ ట్యాగ్ లైన్‌ను సినిమాకు పెట్టారు. అయితే ఏమైందో ఏమో గానీ.. ఫస్ట్ షెడ్యూల్ ముగిశాక ఆచార్య ఆగిపోయింది.

ఆ తర్వాత ఎవరూ ఈ మూవీని రిస్టార్ట్ చేసే ప్రయత్నం చేయలేదు సరికదా దాని వొంక కూడా చూడలేదు. ఆర్థిక ఇబ్బందుల వల్లనో లేక మరే ఇతర కారణం వల్లనో శ్రీకాంత్ ఆచార్య ఆరంభంలోని అటకెక్కింది. కాగా, హీరోగా ఫేడౌట్ అయ్యాక శ్రీకాంత్ సహాయక నటుడిగా మారిన సంగతి తెలిసిందే. సౌత్ భాషా చిత్రాల్లో బలమైన క్యారెక్టర్ రోల్స్ పోషించడమే కాకుండా అవకాశం వచ్చినప్పుడల్లా ప్రతినాయకుడిగానూ శ్రీకాంత్ అలరిస్తున్నారు. మరోవైపు ట్రెండ్ ను ఫాలో అవుతూ వెబ్ సిరీస్‌లలో కూడా యాక్ట్ చేస్తున్నారు. ఈ ఏడాది తెలుగులో గేమ్ ఛేంజర్, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి వంటి చిత్రాల్లో శ్రీకాంత్ కనిపించారు.

# రజినీ రికార్డు బ్రేకింగ్ రెమ్యూనరేషన్.. నిజమెంత?




కోలీవుడ్ సూపర్‌స్టార్ రజినీకాంత్ ఏడు పదుల వయసులో కూడా వరుసపెట్టి సినిమాలు చేస్తూ ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. కూలీ సినిమా ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కూలీ తర్వాత రజినీకాంత్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో జైలర్ కు సీక్వెల్ గా జైలర్2 చేస్తున్న సంగతి తెలిసిందే. అప్పటివరకు వరుస ఫ్లాపులతో ఉన్న రజినీకాంత్‌కు జైలర్ సినిమా ఇచ్చి బూస్టప్ అంతా ఇంతా కాదు. నెల్సన్ దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ ఎంత పెద్ద హిట్టైందో తెలిసిందే. రజినీ కెరీర్లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ఈ సినిమా రూ. 600 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. ఆ సినిమాలో రజినీ స్టైలిష్ యాక్టింగ్, మోహన్ లాల్, శివరాజ్ కుమార్ క్యామియో, అనిరుధ్ మ్యూజిక్ జైలర్ ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లాయి. అలాంటి జైలర్ కు సీక్వెల్ గా జైలర్2 కు తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. జైలర్2 ను ఈసారి డైరెక్టర్ నెల్సన్ జైలర్ కు మించేలా మరింత భారీ గా ప్లాన్ చేస్తున్నాడట. కళానిధి మారన్ సన్ పిక్చర్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో జైలర్2 ను నిర్మిస్తున్నాడు. జైలర్2 కు రజినీకాంత్ తీసుకోబోయే రెమ్యూనరేషన్ గురించి ప్రస్తుతం నెట్టింట ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ హల్‌చల్ చేస్తోంది. జైలర్2 కోసం రజినీ ఏకంగా రూ.260 కోట్లు తీసుకుంటున్నట్టు రూమర్లు వినిపిస్తున్నాయి. ఈ వార్త నిజమైతే కోలీవుడ్‌లోనే కాకుండా భారతదేశంలోనే ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటున్న హీరోగా రజినీ రికార్డుకెక్కుతాడు. జైలర్2 కు అనిరుధ్ సంగీతం అందిస్తుండగా, శివరాజ్ కుమార్, మోహన్ లాల్‌తో పాటూ మరికొందరు స్టార్లు కూడా గెస్ట్ రోల్స్ చేసే అవకాశముంది. అనౌన్స్‌మెంట్ వీడియోతోనే రికార్డులు సృష్టించిన జైలర్2 వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బేబమ్మ తెలుగు ప్రేమ.. సక్సెస్ కోసం పాట్లు..!



ఉప్పెన సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భామ కృతి శెట్టి. ఆ సినిమాలో బేబమ్మగా అమ్మడు సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. సినిమా రిలీజై సెన్సేషనల్ హిట్ కాగా కృతి ఎక్కడ కనిపించినా సరే బేబమ్మ అనే పిలిచారు. ఉప్పెన క్రేజ్‌తో వరుస ఛాన్స్‌లు రావడం వాటిలో హిట్లు ఫ్లాపులు పడటం జరిగింది. ఐతే అరడజను సినిమాలు చేశాక కృతి చేసిన సినిమాల్లో సక్సెస్‌ల కన్నా ఫెయిల్యూర్స్ ఎక్కువ ఉన్నాయి. అందుకే అమ్మడికి కెరీర్ విషయంలో టెన్షన్ పట్టుకుంది. తెలుగులో లాస్ట్ ఇయర్ చివరగా శర్వానంద్‌తో మనమే సినిమా చేసింది కృతి శెట్టి. ఆ సినిమా కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అందుకే మరో ఛాన్స్ అందుకోలేదు. ఈ గ్యాప్‌లో తమిళ్‌లో రెండు సినిమాల ఆఫర్ అందుకుంది కృతి శెట్టి. జినీ, ఎల్.ఐ.కె సినిమాల్లో నటిస్తున్న కృతి ఆ ప్రాజెక్ట్‌ల మీద చాలా హోప్స్ పెట్టుకుంది. తెలుగులో మరో ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్న కృతి శెట్టి ఆ అవకాశం వచ్చే లోగా తెలుగు మీద ప్రేమ చూపించాలని ఫిక్స్ అయ్యింది. అందుకే తెలుగు లెర్నింగ్ నేర్చుకుంటుంది కృతి శెట్టి. ఈమధ్య హీరోయిన్స్ అంతా కూడా తమ డబ్బింగ్ తామే చెప్పుకుంటున్నారు. తెలుగు భాష మీద పట్టు ఉంటే కచ్చితంగా అది ఇంకాస్త ఈజీ అవుతుంది. అందుకే కృతి శెట్టి కూడా తెలుగు భాష నేర్చుకుంటుందట. సొంత డబ్బింగ్‌లో చిన్న చిన్న పొరపాట్లు కూడా చేయకుండా ఉండేందుకు ఇంకా చెప్పే డైలాగ్ యొక్క ఫీలింగ్‌ని అర్థం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. అంతేకాదు అసలు తెలుగు వచ్చి నటిస్తే యాక్టింగ్‌కి కూడా ఎంతో హెల్ప్ అవుతుంది. బేబమ్మ వేసిన ఈ స్టెప్ ఆమె కెరీర్‌కి నిజంగానే ప్లస్ అయ్యే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. కృతి శెట్టికి మరో సూపర్ హిట్ పడితే కానీ ఆమె మళ్లీ తిరిగి ఫాంలోకి వచ్చే ఛాన్స్ కనిపించట్లేదు. హిట్టు కాదు కనీసం ఒక సినిమా ఆఫర్ కూడా ఆమెకు రావట్లేదని టాక్. తెలుగులో అవకాశాలు రాకపోయినా వెయిట్ చేసినా మంచి ఆఫర్ కొట్టేయాలని ఫిక్స్ అయ్యింది అమ్మడు. మరి బేబమ్మ ఈ ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయన్నది చూడాలి.

# నటిగా ఫెయిలతే త్రిష సైకాలజిస్ట్!



అందాల త్రిష సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. వరసగా సీనియర్ హీరోలతో ఛాన్సులందుకుంటూ బిజీగా ఉంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తైన సినిమాలు కొన్ని అయితే కమిట్ అయిన చిత్రాలు మరికొన్ని. ఇవన్నీ సక్సెస్ అయితే త్రిష కెరీర్‌కి ఇంకొన్నాళ్లు తిరుంగుడదు. వయసుతో సంబంధం లేకుండా కొత్త అవకాశాలు అందుకోల్గుతుంది. నటిగా ఇప్పటికే చాలా సినిమాలు చేసింది. ఇండస్ట్రీలో సుదీర్ఘ అనుభవం సంపాదించింది. త్రిషకు తీరని డ్రీమ్ రోల్స్ ఏవైనా ఉన్నాయా? అంటే ప్రిన్సెస్ తరహా పాత్రలు ఒక్కటే మిగిలి ఉన్నాయి. అలాగే లేడీ ఓరియేంటెడ్ నాయికగానూ ప్రూవ్ చేసుకోలేకపోయింది మినహా దాదాపు అన్ని రకాల పాత్రలు పోషించింది. ఇదంతా ఒకే ఒకవేళ త్రిష నటి అవ్వకపోయి ఉంటే ఇంకే రంగంలో ఉండేది? అన్న ప్రశ్న ఆమె ముందుకెళ్లింది. దీనికి అమ్మడు ఏమని బదులిచ్చిందో తెలుసా? మంచి సైకాలజిస్ట్‌ను అయ్యేదాన్ని అని తెలిపింది.

నటనకంటే ముందే సైకాలజిస్ట్ అవ్వాలనుకుందిట. ఆ రకమైన చదువులు పూర్తి చేసిందిట. అదే సమ యంలో అందాల పోటీల్లో కూడా పాల్గొనడంతో అక్కడ సక్సెస్ అవ్వడంతో యాడ్స్‌లో నటించే ఛాన్సులు రావడం... అదే సమయంలో సినిమాకి అవకాశం రావడంతో జీవితం కొత్త టర్నింగ్ తీసుకుందని తెలిపింది. త్రిష నీ మనసు నాకు తెలుసు అనే తెలుగు చిత్రంతోనే ఇక్కడ కెరీర్ ప్రారంభించింది. అటుపై వర్షం, నువ్వొస్తానంటే నేనొద్దంటానా, అతడు, పౌర్ణమి, స్టాలిన్‌లాంటి వరుస విజయవంతమైన చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. రెండు దశాబ్దాలకు పైగా తెలుగులో కెరీర్ కొనసాగించింది. ఇప్పటికీ నవతరం భామల నుంచి పోటీని ఎదుర్కొంటూ సినిమాలు చేస్తుంది.

# పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మన తెలుగు బిడ్డ మురళీ నాయక్ వీర మరణం పొందడం తీవ్ర వేదనను కలిగించింది : అనకాపల్లి ఎం.పీ సిఎం రమేష్




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధభూమిలో వీరోచితంగా పోరాడుతూ మన తెలుగు బిడ్డ సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాను మురళీ నాయక్ వీర మరణం పొందడం పట్ల తీవ్ర రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీరమరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధంలో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు మన తెలుగు రాష్ట్రాల తరపున జేజేలు పలికారు. మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తు వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా మురళీ నాయక్ కుటుంబాన్ని ఆదుకుంటుంది అని తెలియజేసారు.

# అధికారులకు ఏమీ పట్టదు గాక పట్టదు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జి.వి.ఎమ్.సి...వారికి ఇది ఈ ఒక్క విషయమే కాదు..రోడ్లు ఆక్రమించి, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి రోడ్లపై వేసిన జీబ్రా గుర్తులు ఉన్న వాటిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా గాని, వెహికల్స్ కోసమై పార్కింగ్‌కై ఉన్న సెల్లార్లులో వ్యాపారాలు చేసుకున్నా గాని, ఈ రోడ్లుపై నిత్యం వేలాది మంది బాటసారులు, పాదచారులు వాహనాలు వెళుతున్నా గాని రోడ్లపై ఎవరి ఇష్టారాజ్యంగా వారు తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు చేస్తున్నా గాని, రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నా గాని, అటు ట్రాఫిక్ పోలీసులకు గాని, ఇటు స్థానిక జి.వి.ఎమ్.సి. అధికారులకు గాని ఏమీ పట్టదు గాక పట్టదు. ఇది ఎప్పటినుండో జరుగుతు ఉన్నా గాని, వారికి కంప్లెయింట్ ఇచ్చినా గాని వారికి అస్సలు పట్టదుగాక పట్టని విషయం..ఇది మన గ్రహచారమని అనుకొని చూస్తూ ఉండాలి తప్ప వారికి ఏమీ పట్టదు..అస్సలు పట్టించుకోరు..పేరుకే అనకాపల్లి జిల్లా మరియు ఉమ్మడి జి.వి.ఎమ్.సి. ఇదీ అనకాపల్లి పట్టణ విచిత్ర ట్రాఫిక్ పరిష్టితి. బల్లా నాగభూషణము, అధ్యక్షులు, సిద్దార్థ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్, రి. మరియు భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత.

# ఐ అండ్ పిఆర్ డైరెక్టర్ శుక్లా దృష్టికి స్మాల్ పత్రికల సమస్యలు

**- ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ తీర్మానాలపై సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ హిమాన్షు శుక్లా - రెగ్యులారిటీ కలిగిన ఎంప్యానల్‌మెంట్ లేని దినపత్రికలు, పిరియాడికల్స్‌కు దశల వారీగా యాడ్స్ విడుదలకు హామీ - ఎంప్యానల్డ్ స్మాల్ దిన పత్రికలకు స్లాబ్ రేటు పెంపుకు సానుకూల స్పందన - పెండింగ్ బిల్లులు అన్నీ త్వరలోనే చెల్లింపు - కొత్తగా ఎంప్యానల్ మెంట్ విషయంలో కాస్త వెసులుబాటు - ధన్యవాదాలు తెలిపిన అసోసియేషన్ ప్రతినిధులు**



**అమరావతి, (రాజధాని వార్తలు):** గత నెల 25న విజయవాడలోని కందుకూరి కళ్యాణ మండపంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (రి. నెం :312/2024) రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లూరు ప్రసాద్ కుమార్, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావులు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకొని వెళ్లారు.గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలు అంశాలను ఆయనతో చర్చించారు. ఆయన వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. రెగ్యులారిటీ కలిగి ఎంప్యానల్ మెంట్ లేని స్మాల్ దినపత్రికలు, పిరియాడికల్స్ కు దశల వారిగా యాడ్స్ విడుదలకు హామీ ఇచ్చారు. ఎంప్యానల్డ్ స్మాల్ దినపత్రికలకు స్లాబ్ రేటు పెంపుదలకు సానుకూలంగా స్పందించారు. పెండింగ్ బిల్స్‌తోపాటు ఈ ఏడాది విడుదల చేసిన ప్రకటనల బిల్లులు త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. నూతనంగా ఎంప్యానల్ మెంట్ చేసుకునేవారికి ఎదురవుతున్న సాంకేతిక సమస్యల విషయంలో కొంత వెసులు బాటు కల్పించాలని కోరిన మీదట ఆయన సానుకూలంగా స్పందించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా స్మాల్ పత్రికలకు అన్ని విధాలా సహకారం అందిస్తున్నందుకు ఆయనకు అసోసియేషన్ తరపున రాష్ట్ర ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

# దర్జాగా కొబ్బరి బొండాల వ్యాపారం

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి పట్టణము నడి రోడ్డు 83వ వార్డు పరిధిలో ఎండాకాలంలో ప్రజలకోసం, బాటసారుల కోసం స్థానిక జి.వి.ఎమ్.సి.వారు ఏర్పాటు చేసిన గ్రీన్ షెల్టర్‌ను ఆక్రమించి ఆ షెల్టర్‌లోనే దర్జాగా కొబ్బరి బొండాల వ్యాపారము చేసుకుంటున్న విచిత్ర వైనం. అయినా ఈ విషయం జి.వి.ఎమ్.సి.వారికి గాని ట్రాఫిక్ పోలీసులకి గాని పట్టని విచిత్ర విడ్డూరం.






# ప్రయాణికుడిపై దాడి...రూ. 5 లక్షలు ఫైన్ వేసిన ఇండియన్ రైల్వే

**(రాజధాని వార్తలు):** రైళ్ళలో అధిక ధరలకు ఫుడ్ అమ్ముతున్నారని కంప్లైంట్ చేసిన వ్యక్తిపై క్యాటరింగ్ సిబ్బంది దాడి చేసిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో ఇండియన్ రైల్వే స్పందించింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నాం. క్యాటరర్‌పై 5 లక్షల రూపాయలు జరిమానా విధించాం. కథువా రైల్వే పోలీసులు వీరిపై కేసు నమోదు చేసారు. నిశితంగా ఈ కేసును పరిశీలిస్తాం. దర్యాప్తు ఆధారంగా వీరిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని ట్వీట్ చేసింది.

# ఒత్తిడిలో అద్భుతం...40 ప్రోస్ క్రీడా నైపుణ్యం చాటింది


**- యూనిటీ కప్ చింతపల్లి సీజన్-3 టోర్నీ...తేజ అద్భుత ప్రదర్శన - మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా తేజ...బీజేపీ నేత శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం**





**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న యూనిటీ కప్ సీజన్-3 అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠభరిత పోరులతో క్రీడాభిమానులను ఆకట్టుకుంటోంది. శుక్రవారం జరిగిన ముఖ్యమైన మ్యాచ్‌లో 40 ప్రోస్ జట్టు, బంధ వీధి జట్టు మధ్య జరిగిన పోరు ఆద్యంతం ఉత్కంఠతో సాగింది. పొట్టి ఫార్మాట్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంధ వీధి జట్టు ముందుగా బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 10 ఓవర్లలో 73 పరుగులు మాత్రమే చేయగలిగింది. ప్రారంభంలో నెమ్మదిగా సాగిన ఇన్నింగ్స్‌కు మధ్యలో కొంత ఊపు వచ్చినా, 40 ప్రోస్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన దెబ్బకొట్టింది. లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన 40 ప్రోస్ జట్టు ఆరంభంలో ఒత్తిడికి గురై మూడు వికెట్లు కోల్పోయింది. కానీ నాలుగో ఓవర్ నాటికే ఆ జట్టు మోమెంటం అందుకుని ధాటిగా ఆడింది. ముఖ్యంగా యువ ఆటగాడు తేజ బౌలింగ్‌లో నాలుగు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థుల దెబ్బతీశాడు. బ్యాటింగ్‌లోనూ చురుకుగా వ్యవహరించిన తేజ "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్"గా నిలిచాడు. అతడికి బహుమతిని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కదుల శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ విజయంతో 40 ప్రోస్ జట్టు కెప్టెన్ చల్లంగి నరేష్ సారథ్యంలో టోర్నీలో తమ స్థాయిని మరింత పెంచుకుంది. క్రీడా ప్రతిభకు వేదికలుగా నిలుస్తున్న ఈ టోర్నమెంట్ ద్వారా యువ ఆటగాళ్లు తమ నైపుణ్యాన్ని నిరూపించుకునే అవకాశాన్ని పొందుతున్నారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు దొండ చినబాబు, వజ్రపు లోకేష్, తరుణ్, బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్లె సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 30 రకాల నవధాన్య విత్తనాలతో 160 కిట్స్ తయారు






**నాతవరం, (రాజధాని వార్తలు):** పాయకరావుపేట వ్యవసాయ సబ్ డివిజన్ నాతవరం మండలంలో పికె గూడెం యూనిట్ 100% ప్రకృతి వ్యవసాయ గ్రామం అయినటువంటి ఎస్‌బి పట్నం గ్రామంలో గ్రామ సర్పంచ్ సతీష్ ఆధ్వర్యంలో 30 రకాల నవధాన్య విత్తనాలతో 160 కిట్స్ తయారు చేయడం జరిగినది. గ్రామ సర్పంచ్ సతీష్ ఈ నవధాన్యాల వేయడం వల్ల ఉపయోగాలు గురించి వివరించి చెప్పడం జరిగినది.

నవధాన్య విత్తనాలు వేయడం వల్ల భూమి సారవంతం అవుతుంది, సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి, భూమి గుల్ల బారుతుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. పురుగులు తెగుళ్ల రావు అలాగే భూములోని సేంద్రియ కర్బను శాతం స్థిరంగా ఉంటుంది. అలాగే ప్రధాన పంట దిగబడి బాగుంటుంది, అలాగే పశువులకు మేతగా ఉప యోగించుకోవడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయి పాలు దిగిబడి బాగా వస్తుంది వెన్న శాతం పెరుగుతుంది అని జిల్లా బ్లూమ్ ఇన్చార్జి గోవింద వివరించి చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శైలజ, విఏఏ విజయ సాహితీ గ్రామ పెద్దలు ఏపి సిఎన్ఎఫ్ సిబ్బంది వెంకటలక్ష్మి MT, L1, icrps నారాయణమూర్తి, దుర్గా మాతాజీ, ధనలక్ష్మి, సంధ్య, గణేష్ హాజరు కావడం జరిగింది.

# సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

**- జమ్మికుంట ఐజెయు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సిని శ్రీనివాస్**

**జమ్మికుంట, (రాజధాని వార్తలు):** జమ్మికుంట మండల ఐజేయు ఆధ్వ ర్యంలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఎలాంటి నోటీసులు లేకుండా సోదాలు నిర్వహించడంతోపాటు అక్రమ కేసులు పెట్టడం హేయనీయమైన చర్య అని నిరసిస్తూ తాసిల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సిని శ్రీనివాస్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టడం సరైన పద్ధతి కాదని, సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని స్వేచ్ఛగా రాసే హక్కు పత్రికలకు ఉందని, అలాంటి పత్రిక ఎడిటర్లపై చర్యలు చేపట్టే విధంగా ప్రభుత్వం ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆకినపల్లి సంపత్, రఘుపతి, నసీరుద్దీన్, ఏ బూసి శ్రీనివాస్, రఘుబాబు, కొండల్ రెడ్డి, రవి, యూసుఫ్, అశోక్, రషీద్, అంకుస్, అన్వర్, సదానందం, రాజేందర్, రంజిత్, విజయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షల ఫలితాలు షార్ట్ మెమోలు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** మార్చి 2025 ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షల ఫలితాలు షార్ట్ మెమోలు పాఠశాల విద్యాశాఖ వెబ్సైట్లో అందుబాటులో ఉన్నట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడు తెలిపారు. మార్చి 2025 ఎస్.ఎస్.సి. పబ్లిక్ పరీక్షలు 17.03.2025 నుండి 01.04.2025 వరకు జరిగాయని మరియు ఫలితాలు 23.04.2025న ప్రకటించబడ్డాయని మరియు షార్ట్ మెమోలు (సబ్జెక్టుల వారీగా మార్కుల మెమోరాండం) 08.05.2025 నుండి వెబ్సైట్లో అందుబాటులో కలవని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్ ఆధారాలను ఉపయోగించి "సబ్జెక్టుల వారీగా యొక్క మెమోరాండం"ని డౌన్లోడ్ చేసుకుని మరియు సంతకం చేసిన కాపీలను వారి సంబంధిత పాఠశాలల విద్యార్థులకు అందజేయవలెనని, మెమోలలో ప్రదానోపాధ్యాయుడు లేదా తల్లిదండ్రులు గుర్తించిన ఏవైనా సవరణలను ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లలో సవరణలు చేయడానికి ప్రభుత్వ పరీక్షల సంచాలకులు, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్, దృష్టికి తీసుకు రావాలని తెలియజేయడమైనదన్నారు. కావున ఏవైనా సవరణలు ఉంటే అవసరమైన పత్రాలను అందించాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచిస్తూ, సవరణలకు అడ్మిషన్ రిజిస్టర్కు సరిగ్గా జతచేయబడిన పాఠశాల రికార్డుల రుజువు మరియు ప్రధానోపాధ్యాయుడు ధృవీకరించిన షార్ట్ మెమో (సబ్జెక్ట్ వారీగా మార్కుల మెమోరాండం) కాపీ అందజేయాలని తెలిపారు. అందరి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పైన తెలిపిన ఆధారాల పత్రాలతో 25.05.2025 లోపు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్ పంపవలసియున్నదని తెలియజేసారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan